# కథ అడ్డం తిరిగింది!

రాజారావుగారికి సూపరింటెండింగ్ ఇంజనీరుగా ప్రమోషన్ వచ్చింది. ఆయన సంతోషానికి అవధుల్లేవు. స్వతహాగా రాజారావుగారు చాలా పిసినిగొట్టు. ప్రభుత్వం వారు కల్పించిన సదుపాయాలను విరివిగా వాడేసుకోవడంలో బహుదిట్ట. ఎస్.ఇ. అవగానే సదుపాయాలెక్కువవుతాయి కదా! అందుకే ఆయనకంత సంతోషంగా వుంది. రేపట్నించి, దర్జాగా కారులో తిరగొచ్చు. తన పిల్లలిద్దర్నీ స్కూలుకి కారులో దింపవచ్చు. బజారుకి, కూరగాయల మార్కెట్టుకీ, సినిమాలకీ..ఇలా ఒకటేమిటి, పెట్రోలుకి పైసా ఖర్చుండదు. అంతేకాదు, ఆఫీసులోను, యింటిలోను ఫోను సౌకర్యం. ఇకపైన తనకు ఫోను ఖర్చు పైసా వుండదు. ఇంట్లో పనులన్నీ చెయ్యడానికి, బట్టలుతకడానికి కాంట్రాక్టు లేబరుని ఇంట్లో వాడుకోవచ్చు. పనిమనిషిని, ధోబీని మానిపించెయ్యొచ్చు. ఇలా చెప్పుకుపోతుంటే, ఎన్నయినా సదుపాయాలు తన జీతమంతా మిగులే! జేబులోంచి ఒక్కపైసా తియ్యక్కర్లేదు. పై సంపాదనలో తను అందెవేసిన చేయి. అందులో ప్రమోషను తను వున్న వూర్లోనే పోస్టింగు ఇవ్వడం, ఆయన్ని ఆయన కుటుంబ సభ్యుల్ని సంతోష సముద్రంలో ముంచి తేల్చింది.

రాజారావుగారు తన ఆశయాలన్నిటినీ తు.చ. తప్పకుండా ఆచరణలో పెట్టేరు. ఎస్.ఇ.గా తన మొదటి జీతం రాగానే మొత్తం బ్యాంకులో వేసేసేరు. పైసా ఖర్చుంటేగా? పైగా అదనపు ఆదాయం నాలుగురెట్లు పెరిగింది.

ఒకరోజు భార్య శాంత "ఏమండీ! మీరు ఆఫీసుకెళ్ళగానే కారు ఒకసారి పంపించరూ? నాకు బజార్లో చాలా పనులున్నాయి"

"చిత్తం! కారెప్పుడూ తమరి కంట్రోలులోనే వుంటోందిగా!" పరిహాసంగా అన్నారు రాజారావుగారు.

మధ్యాహ్నం మూడుగంటలకు "సార్! మిమ్మల్ని కలవాలిట!" విజిటింగ్ కార్డు ఇచ్చేడు అటెండరు అచ్చయ్య. రాజారావుగారికి ఆ కార్డు చూసి, ముచ్చెమటలు పట్టేయి. ఆ కార్డు విజిలెన్స్ డి.ఎస్.పి.ది. తన కంగారును పైకి కనబడనీకుండా "రమ్మను" అన్నారు.

"నమస్తే సార్! నేను రంగనాథరావు, విజిలెన్స్ డి.ఎస్.పి."

"నమస్తే! కూర్చోండి. ఏం తీసుకుంటారు? కాఫీ, టీ, కూల్‌డ్రింక్" కాలింగ్‌బెల్ నొక్కుతూ అడిగేరు రాజారావుగారు.

"నో సార్! థాంక్యూ! మేమొక చిన్న పనిమీద వొచ్చాము"

"చెప్పండి!" రాజారావుగారికి టెన్షన్ పెరిగిపోయింది.

"ఎ.పి.యమ్.1106 కారు మీదేకదా! ఐ మీన్ అఫిషియల్"

"అవును!"

"అది మీరు ఆఫీసు పనికి కాకుండా పర్సనల్ పనులకి వాడుతున్నారని మాకు కంప్లయింట్ వచ్చింది"

"నో! నో! ఎప్పుడైనా ఎమర్జన్సీకి"

"లేదు సార్! మీ కారు మీ ఫామిలీ మెంబర్సు వాడుతుంటే చాలాసార్లు కనిపించింది బజార్లోను, సినిమా థియేటర్ల దగ్గర... ఇలా చాలా చోట్ల, రోజూ!"

"మీరు పొరబడుతున్నారేమో"

"లేదు సార్! ఇవిగో సంబంధిత ఫోటోలు. కంప్లయింటు ఇచ్చినవారు జతపర్చినవి."

ఆ ఫోటోలను చూసి రాజారావుగారికి ఒక్కసారి ఒళ్ళంతా కరెంటు షాకిచ్చినట్లయింది. శాంత కార్లోంచి దిగుతుంటేను, ఎక్కుతుంటేను వివిధచోట్ల తీసినవి. ఇంత క్లోజ్‌గా తననెవరు ఫాలో అవుతున్నారబ్బా ఆశ్చర్యంలో మునిగిపోయేరు ఎస్.ఇ.గారు. "సారీ సర్! నేను చేయగలిగిందేమీ లేదు. మిమ్మల్ని సస్పెండ్ చెయ్యమని పైకి రికమెండ్ చేయడం తప్ప!"

"చూడండి రంగనాథరావుగారూ! మీకెంత కావాలో చెప్పండి. అంతేకాని రోడ్డునపోయే దానయ్య ఇచ్చే కంప్లయింటు ఆధారంగా నన్ను బ్లాక్‌మెయిల్ చెయ్యడం భావ్యం కాదు"

"సార్! మీరు ఆ కుర్చీలో కూర్చోకపోతే మీరూ ఒక దానయ్య అవుతారుగా! నేను చేనును మేసే కంచెను కాను! మీ ఆఫర్‌కి థాంక్స్ శెలవు"

"కథ అడ్డం తిరిగిందే!" ఆలోచనలో పడ్డాడు మిస్టర్ రాజారావు.

-బి.రాధాకృష్ణమూర్తి
(విజయవాడ)

# దేవుడి వీలునామా

"నాన్నా! నీవు వీలునామా రాసేటప్పుడు అలా రాయడం ఏమి బాగోలేదు" అన్నాడు శ్రీను.

"నేను చేసిన దాంట్లో తప్పేముంది. రేపు నీవు నీ పెళ్లాం మోజులో పడి మమ్మల్ని చూస్తావన్న నమ్మకం ఏముంది?" అన్నాడు రామయ్య.

గుడికొచ్చిన ఆ తండ్రీకొడుకుల సంభాషణని ఆ పక్కనే కూర్చున్న స్వామీజీ వింటున్నారు.

"బాబూ! మీరిద్దరు ఒకసారి ఇలా వస్తారా?" పిలిచారు స్వామీజీ.స్వామీజీ పిలుపుతో వారి ఆర్గ్యుమెంట్ ఆపి స్వామీజీ ముందు కూర్చున్నారు.

"అసలు ఏం జరిగింది నాయనా? మీ గొడవకు కారణం నాకు కాస్త వివరంగా చెబుతారా"

"ఏమీ లేదు స్వామీజీ! మా నాన్న వీలునామా రాస్తూ నా తదనంతరం మాత్రమే ఆస్తి అనుభవించడానికి నా కొడుక్కి హక్కు ఉంటుందని రాయించాడు" చెప్పాడు శ్రీను.

"అది కాదు స్వామి...నా స్వార్జితమైన ఆస్తి అంతా ఇప్పుడే వీడి పేరు మీద కట్టబడితే రేపు మమ్మల్ని చూస్తాడన్న నమ్మకమేముంది?" ప్రశ్నించాడు రామయ్య.

దానికి స్వామీజీ సమాధానం చెపుతూ- "రామయ్యా! నీవు సంపాదించిన ఆస్తి నీ కన్నకుమారుడికి వీలునామా రాస్తూ నా..తదనంతరం అని రాశావు. అసలు ఈ నా...అనే స్వార్థాన్ని మానవుడు ఎందుకు వీడనాడటం లేదో అర్థం కావడం లేదు. నీ తదనంతరం అని రాశావు. అసలు నీ తదనంతరం నీదంటూ ఈ భూమి మీద ఏముంటుందని...ఉన్నా అనుభవించడానికి ఈ భగవంతుడు నీకు ఎక్కడ అవకాశం ఇచ్చాడు. నీ కన్నబిడ్డలు నిన్ను చూస్తారో చూడరో నన్న అపనమ్మకం, భయమే నీ చేత ఆ పని చేయించింది. కన్నబిడ్డల ప్రేమానురాగాలు పొందలేని నీవు ఎంత ఆస్తి ఉంటే సుఖమేముంది చెప్పు. ఆత్మీయతాభిమానాలు డబ్బుతో కొనగలమా! నా అనేది ఈ భూమి మీద మనకేముంటుంది...చివరకు అంతా శూన్యం...భగవంతుని లీల"

స్వామీజీ శ్రీనును పిలిచి- "బాబూ శ్రీను మీ నాన్న రాసిన వీలునామాలో నా...తదనంతరం అని రాశాడంటే నీ మీద, నీ నడవడిక మీద నమ్మకం లేనట్టే కదా. నీవు ముందుగా మంచి నడవడిక అలవర్చుకో...తల్లిదండ్రుల మీద ప్రేమానురాగాలు చూపించు. ఈ ఆస్తులు అంతస్తులు ఎల్లప్పుడూ మన వెంట ఉండవు నాయనా...నీవు చేసిన ధర్మం ఏదైనా ఉంటే అది తప్పక నిన్ను కాపాడుతుంది. కష్టపడి నీ కాళ్ల మీద నీవు నిలబడు. నీవు సంపాదించిన డబ్బుతో తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకో. అప్పుడు నీ తండ్రి రాసిచ్చిన వీలునామాతో పనేముంది. మీరిద్దరికి నేను చెప్పేది ఒక్కటే జాగ్రత్తగా వినండి...

భగవంతుడు మన నుదుట మీద వీలునామా ఏమని రాశాడో తెలుసా? తను మనకిచ్చిన ఆస్తులు, అంతస్తులు అనుభవించడానికే గానీ కూడా తీసుకెళ్లడానికి వీల్లేకుండా రాశాడు. అందుకే మనం చనిపోయిన తరువాత ఎన్ని కోట్లు సంపాదించినా నూలుపోగు కూడా మనవెంట రాదు. ఈ విషయం మరిచి మానవుడు నా...నీ...అనే స్వార్థంతో వివేకం మరచి ప్రవర్తిస్తున్నాడు. మనం చేసిన పాపపుణ్యాలు మాత్రమే మన వెంట వస్తాయి. మిగిలినవన్నీ ఈ మట్టిలో కలిసిపోవలసిందే. ఇది జగమెరిగిన సత్యం. మర్చిపోయి స్వార్థ బుద్ధితో ప్రవర్తించకండి." చెప్పడం పూర్తి చేశారు స్వామీజీ.

తండ్రి కొడుకులిద్దరు స్వామీజీ కాళ్లమీద పడ్డారు. "స్వామీజీ... మమ్మల్ని క్షమించండి. సహజంగా ప్రతి మానవుడులోను ఉన్న ఈ స్వార్థం మమ్మల్ని ఆవహించింది. ఈ స్వార్థమే మనుషుల మధ్య ప్రేమానురాగాల్ని దూరం చేస్తుందని గ్రహించలేకపోయాం. ఇక నుండి స్వార్థం విడిచి మాకున్న దాన్లో ఎదుటి వారికి సహాయం చేయడానికి చూస్తాం. మాకు సెలవిప్పించండి స్వామీ."గుడిలో దేవుని దర్శనంతోపాటు మంచి విషయం గ్రహించామన్న ఆత్మసంతృప్తితో బయలుదేరారు తండ్రీకొడుకులు.

-బేరా చినబాబు (నర్సీపట్నం)